www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 17 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | రాజమహేంద్రవరం సిటీ


Rajamahendravaram | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



29వ వర్ధంతి
నా పరిపూర్ణ, పరిశుద్ధ హృదయంతో..
నిను కొల్చు భాగ్యం ఇంకెప్పుడూ..
ప్రభూ... ఈ జన్మకూ...
BOMMARILLU
ఆయన వీరాభిమాని
"బొమ్మరిల్లు వారి" సంస్థ అధినేత
వై.వి.ఎస్. చౌదరి


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
KING OF SANKRANTI
A BOBBY KOLLI FILM
డాకు మహారాజ్
SURYADEVARA NAGA VAMSI SAI SOUJANYA
A THAMAN S MUSICAL
ADITYA MUSIC


MAHAAKAAL PICTURES
TRAILER OUT NOW
IN CINEMAS FROM
24th JAN
హత్య
DIRECTOR SRIVIDYA BASAWA PRODUCER S PRASHANTH REDDY
D.O.P ABHIRAJ NAIR MUSIC DIRECTOR NARESH KUMARAN P EDITOR ANIL KUMAR P
COLORIST K VISHNUVARDHAN SFX SYNC CINEMA MIXING ENGG ARAVIND MENON
ART DIRECTOR S PRASHANTH REDDY EP S SRIKANTH REDDY PUBLICITY DESIGN ARKO


GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
RAGAM MOVIES
MOVIE MAXX
SREENIWAAS MANDALA
SVM
SRI VEDAKSHARA MOVIES
CHINTHAPALLI RAMARAO
TOVINO THOMAS
IDENTITY
తెలుగులో
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్ చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.
WRITTEN & DIRECTED BY AKHIL PAUL - ANAS KHAN
PRODUCER RAJU MALLIATH PRODUCER DR ROY C J
24TH JAN 2025


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
ZEE STUDIOS
DIL RAJU PRODUCTION
SANKRANTI BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
BLOCKBUSTER PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH
T-SERIES

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



అపు
'రూపాలు'
నేడు అమలాపురంలో చిత్రకళ బ్రహ్మోత్సవం వేదిక ప్రారంభం.. బాలలకు పోటీలు.. రేపు అంతర్జాతీయ చిత్ర కళా ప్రదర్శన - 2లో

శనివారం | 18-1-2025 | Rajamahendravaram | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | రాజమహేంద్రవరం సిటీ



కిక్కే కిక్కు

- జిల్లాలో సంక్రాంతికి తెగ తాగేశారు
- నాలుగు రోజులకు కలిపి రూ.27.50కోట్ల మద్యం అమ్మకాలు
- మొత్తం 29,653 ఐఎంఎల్ మద్యం, 15,650 బీరు కేసులు ఉఫ్
- కూటమి ప్రభుత్వం రాకతో ధరలు తగ్గడంతో భారీగా పెరిగిన సేల్స్
- పండగ నేపథ్యంలో బరుల వద్ద బెల్ట్‌షాపుల ద్వారా విక్రయాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సంక్రాంతి పండగకు మందుబాబులు తెగ తాగేశారు. ఏడాది మొత్తంలో అత్యంత కీలకమైన పెద్దపండగ కావడంతో పూటుగా సీసాలకు సీసాలు ఎత్తేశారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వరుసపెట్టి నాలుగురోజులు బాటిళ్లకు బాటిళ్లు ఖాళీ చేసేశారు. దీంతో మద్యం అమ్మకాలు జిల్లాలో గణనీయంగా పెరిగిపోయాయి. నాలుగురోజులకు కలిపి ఏకంగా రూ.27.50కోట్ల మద్యం అమ్ముడైంది. గతేడాది సంక్రాంతి పండగ అమ్మకాలు రూ.22.41కోట్లతో పోల్చితే ఈసారి విక్రయాలు భారీగా పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇచ్చిన మాట ప్రకారం మద్యం ధరలు భారీగా తగ్గించింది. చీప్ లిక్కర్ నుంచి అనేక ప్రముఖ బ్రాండ్ల మద్యం, బీర్ల వరకు రేట్లు తగ్గాయి. దీంతో ఈ పండగకు అమ్ముడైన మద్యం అమాంతం పెరిగిపోయింది. కాగా మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది సంక్రాంతికి జిల్లాలో అన్ని రకాల వస్త్ర, వాణిజ్య వ్యాపారం సైతం భారీగా పెరిగిపోయింది. జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పేరుతో 15రోజుల్లో రెడీమేడ్, క్లాత్ వస్త్రాల వ్యాపారం రూ.170కోట్లకు పైగానే జరిగిందని అంచనా.

సీసాలకు సీసాలు ఖాళీ..

సంక్రాంతి అంటే పెద్ద పండగ. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకోసం స్వగ్రామాలను వదిలి ఎవరూ ఎక్కడకు వెళ్లినా ఈ పండగకు సొంతూళ్లకు రావాల్సిందే. అదే మందుబాబులకైతే సంక్రాంతి పండగ అసలు సిసలు ఊపు తీసుకువస్తుంది. బంధుమిత్రులతో కలిసి పండగకు వరుసగా మద్యం ఊదేయడం మందుబాబులు ఈ పండగలో పరిపాటి. ఈ నేపథ్యంలో జిల్లాలో సంక్రాంతికి మందుబాబులు తెగ తాగేశారు. భోగి రోజు మొదలుకుని ముక్కనుమ వరకు సీసాలకు సీసాలు ఖాళీ చేసేశారు. దీంతో అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి. భోగి రోజునుంచి ముక్కనుమ వరకు నాలుగురోజుల పాటు జిల్లావ్యాప్తంగా 155 మద్యం షాపుల్లో కలిపి ఏకంగా మందుబాబులు రూ.27.50కోట్ల మందు తాగేశారు. ఇందులో భోగిరోజు రూ.2.50 కోట్లు, సంక్రాంతికి రూ.4కోట్లు, కనుమరోజు రూ.6.25కోట్ల చొప్పున మద్యం అమ్ముడైంది. ఇక కనుమరోజు రాత్రి నాటికి అన్ని మద్యం దుకాణాల్లో స్టాకు ఖాళీ అయిపోవడంతో ఆ మరుసటి రోజు ఉదయాన్నే డిపోల నుంచి యుద్ధప్రాతిపదికన మద్యం దుకాణాలు సరుకు డంప్ చేశాయి. దీంతో ముక్కనుమ అయిన గురువారం ఒక్క రోజే ఏకంగా రూ.12.75 కోట్ల సరుకు అమ్ముడైంది. దీంతో సంక్రాంతి పండగకు జిల్లాలో మద్యం విక్రయాలు రూ.27.50కోట్లు దాటాయి. నాలుగురోజులకు కలిపి జిల్లాలో 29,653 ఐఎంఎల్ కేసుల మద్యం, 15,650 బీరు కేసులు అమ్ముడయ్యాయి. అదే గతేడాది సంక్రాంతికి జిల్లాలో మద్యం రూ.22.41కోట్లు అమ్ముడైంది. అప్పుడు 22,569 ఐఎంఎల్ కేసుల మద్యం, 11,070 కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. అదే 2023 సంక్రాంతికి జిల్లాలో రూ.20.12కోట్ల మద్యం అమ్ముడైంది. ఇందులో ఐఎంఎల్ సీసాలు 8,64,496, బీర్లు 1,39,629 అమ్ముడయ్యాయి. అదే 2022, సంక్రాంతికి అయితే జిల్లాలో రూ.17.66కోట్ల మద్యం అమ్ముడైంది.

పెరిగిన అమ్మకాలు

గతేడాది, అంతకుముందు సంక్రాంతి పండగలతో పోల్చితే ఈసారి జిల్లాలో సంక్రాంతికి మద్యం అమ్మకాలు పెరగడంతోపాటు ఊదేసిన సీసాలు భారీగా పెరిగాయి. గతేడాది సంక్రాంతి నాటికి అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం ధరలు భారీగా పెరిగిపోయాయి. చీప్ లిక్కర్ నుంచి బీరు, ఇతర మద్యం వరకు రెట్టింపు ధరలతో మందుబాబులను పిండేశారు. కానీ ఈ సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మద్యం ధరలను భారీగా తగ్గించింది. దీంతో ధరలు తగ్గడంతో మందుబాబులు తెగతాగేశారు. ఈసారి జిల్లాలో పండగకు కోడిపందేలు భారీగా జరిగాయి. అన్నినియోజకవర్గాలు కలిపి 560చోట్ల పందేల బరులు నిర్వహించారు. వీటివద్ద పండగ నాలుగురోజులు విపరీతంగా మద్యం అమ్ముడైంది. అనేకమంది వ్యాపారులు ఏకంగా బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి మరీ విక్రయాలు జరిపారు. మొత్తం నాలుగురోజుల మద్యం విక్రయాల్లో 30శాతం విక్రయాలు ఇక్కడే జరిగినట్లు అంచనా.

వస్త్ర వ్యాపారం అదుర్స్...

సంక్రాంతి పండగకు ఈసారి జిల్లాలోవస్త్ర, వాణిజ్య వ్యాపారం భారీగా జరిగింది. గతంతో పోల్చితే వీటి విక్రయాలు అమాంతం పెరిగిపోయాయి. సంక్రాంతికి కొత్త దుస్తులను జనం 15 రోజుల వరకు షాపింగ్ చేశారని వస్త్రవ్యాపార సంఘం పేర్కొంది. జిల్లాలో మొత్తం 5,400 వరకు చిన్నాపెద్ద దుకాణాలుండగా, వీటన్నింటితో కలిపి రూ.170కోట్లకు పైగా వ్యాపారం జరిగి ఉంటుందని అంచనా. ఇందులో ఒక్క కాకినాడలోనే రూ.80కోట్ల వరకు ఉంటుందని చెప్తున్నారు. వస్త్ర దుకాణాల షాపింగ్ మాల్స్ లో రూ.50కోట్ల వరకు సేల్స్ జరిగి ఉంటుదని అంచనా వేశారు.



ఎక్కడికక్కడ వెలసిన ప్రైవేట్ చెక్‌పోస్టులు

ఫీ నరేజి!

ప్రైవేట్ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

- మితిమీరిన సీనరేజి దోపిడీ
- వందల్లో ఫీజు..వేలల్లో వసూళ్లు
- లారీకి రూ.4 వేలు డిమాండ్
- డూప్లికేట్ బిల్లులతో హల్‌చల్
- వైసీపీ నుంచి మొదలు
- రెండేళ్ల కాంట్రాక్టు ఒప్పందం
- కూటమిలోనూ వదలని వైనం
- అదే కాంట్రాక్టరు కొనసాగింపు
- ఏప్రిల్ వరకూ అతనిదే హవా
- లారీ యజమానుల లబోదిబో

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మైనింగ్, మినరల్ పేరిట సీనరేజి వసూళ్లు చేసే ప్రైవేట్ ఏజెన్సీల దోపిడీ మితిమీరిపోయింది. అడ్డూ అదుపూ లేకుండా ఇష్టానుసారం దోపిడీ చేస్తున్నారు. సాధారణంగా మైన్స్, మినరల్స్‌ను వినియోగించుకున్నందుకు ప్రభుత్వానికి సీనరేజి చెల్లించడం అనేది మొదటి నుంచీ ఉంది. గతంలో మైన్స్ అధికారులే మైన్స్ లీజులు,అనుమతులిచ్చే సమయంలోనే ఎంతమేర సీనరేజి చెల్లించాలో చెప్పి వసూలు చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చివేసింది. జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా అనే సంస్థకు ఏడాది రూ.116 కోట్లు, రెండేళ్లకు రూ.232 కోట్లు చెల్లించే విధంగా ఒప్పందం పెట్టుకుంది. ప్రతి నెలా ముందుగానే రూ.10 కోట్ల వరకూ కట్టించుకునేలా ఏర్పాటు చేసుకుంది. సుధాకర్ ఇన్‌ఫ్రా పేరిట కాకినాడ, రావులపాలెం, గోకవరం మండల పరిధిలోని ఒక వ్యక్తి కలిసి ప్రైవేట్ చెక్‌పోస్టులు పెట్టి ఎన్నికల ముందు సుమారు 14 నెలల నుంచి దోపిడీ మొదలు పెట్టారు. కూటమి ప్రభుత్వం అదే సంస్థకు కాంట్రాక్టు అప్పగించడంతో దోపిడీ ఆగలేదు.

నాలుగు రెట్లు అదనం..

ఉమ్మడి జిల్లాలో గ్రావెల్, మట్టి, ఇసుక, గ్రానైట్, లేటరైట్ వంటి అపార నిక్షేపాలు ఉన్న సంగతి తెలిసిందే. చెరువులో మట్టి తవ్వినా, కంకర తవ్వినా, ఏ మెటీరియల్ కొనుగోలుచేసినా, కొనుగోలు ధర క్వారీల్లో చెల్లించగా ప్రైవేట్ ఏజన్సీకి సీనరేజీ పేరిట అధికంగా చెల్లించాల్సి వచ్చేది. ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిన ధరలు ఇప్పుడు కూడా క్యూబిక్ మీటరుకు రూ.90, టన్నుకు రూ.60 వరకూ ఉండగా మూడు నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. పైగా డూప్లికేట్ బిల్లులు పెట్టి వసూళ్లకు తెగబడుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మైన్స్, మినరల్స్ వ్యాపారులతోపాటు వాటిని వినియోగించే వినియోగదారులు విసిగిపోవడం గమనార్హం. వైసీపీ హయాంలో కాంట్రాక్టు పొందిన సంస్థ గత ఎన్నికల నాటికి రూ.44 కోట్ల వరకూ బాకీ పెట్టింది. అయినా ఆ దోపిడీ కొనసాగుతూనే ఉంది.

ఫీల్డ్‌లో ఎంఆర్ స్టాఫ్

కూటమి ప్రభుత్వం కూడా మైన్స్ సీనరేజి వసూలు బాధ్యతను మళ్లీ సుధాకర్ ఇన్‌ఫ్రాకే కట్టబెట్టడం విమర్శలకు దారితీస్తోంది. అంతే కాకుండా ఆ సంస్థ చేసే దోపిడీ కారణంగా కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పరిస్థితి ఏర్పడింది. సుధాకర్ సంస్థ పేరిటే అంతా నడుస్తున్నా ఫీల్డ్‌లో మాత్రం ఎంఆర్ సంస్థ సిబ్బంది ఉండడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వం 2023 ఏప్రిల్ 18 నుంచి 2025 వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మైన్స్ సీనరేజ్ వసూలు కాంట్రాక్టును ఈ కంపెనీకి అప్పగించింది.

ఏప్రిల్ వరకూ ఇంతేనా?

తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మైన్స్ పాలసీని ఇంకా పూర్తి స్థాయిలో ప్రకటించలేదు. ప్రస్తుతం సమీక్షలు జరు గుతున్నాయి.ఆయా జిల్లాల నుంచి ప్రభు త్వం సమాచారం కోరింది. దీంతో త్వరలోనే కొత్త పాలసీ రానుంది. ఈలోపు జిల్లాలో దోపిడీ తప్పే లా లేదు. ప్రస్తుతం సీనరేజీ వసూలు చేసే సంస్థకు వచ్చే ఏప్రిల్ 17వ తేదీ వరకూ గడువు ఉంది. తర్వాత ప్రభుత్వ పాలసీ ఎలా ఉంటుందో మరి.ప్రస్తుత విధానం వల్ల వినియోగదారుడు దోపిడీకి గురవుతున్నాడు. ప్రభుత్వ ఆదాయం కోసం సీనరేజీ వసూలు చేయడం మంచిదే. గతంలో క్వారీ లీజుదారులు కూడా సీనరేజి ఎగ్గొట్టేవారు. దానికోసం ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి దోపిడీని ప్రోత్సహించడం ప్రజలు హర్షించరు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా, వినియోగదారులనూ దోచుకోకుండా ఉండే సరైన విధానం తీసుకు రావాల్సి ఉంటుంది.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు పట్టించుకోకుండా గతంలో గ్రావెల్ లారీకి రూ.1000 నుంచి అదనంగా వసూలు చేయగా ఇవాళ ఏకంగా రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. బిల్డింగ్ మెటీరియల్, ఇతర రోడ్డు మెటల్ వంటి వాటికి రూ.4 వేలు వరకూ వసూలు చేస్తున్నారు. అక్రమంగా తవ్వే గ్రావెల్‌కైతే ఇష్టానుసారం వసూలు చేయడం గమనార్హం. అధికారికంగా ఒక బిల్లు ఇచ్చి సుమారు 10 వరకూ డూప్లికేట్ బిల్లులు ఇస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. డూప్లికేట్ బిల్లుల కారణంగా ఇటీవల రౌతులపూడిలో సుమారు 7 లారీలను పట్టుకుని మైనింగ్ అధికారులు కేసు నమోదుచేశారు. అయితే సదరు కాంట్రాక్టు సంస్థ సిబ్బంది ఆగమేఘాలపై వచ్చి డూప్లికేట్ బిల్లులన్నీ తీసేసుకుని అధికారికంగా చెల్లించాల్సిన సొమ్ము చెల్లించి కేసు మాఫీ చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ఇష్టానుసారం దోపిడీ..

గత వైసీపీ ప్రభుత్వం 2020లో 10వ రూల్‌ను సవరణ చేసి, ప్రైవేట్ వ్యక్తులకు సీనరేజి వసూలు అప్పగిస్తూ ఆయా మైన్స్ అండ్ మినరల్స్ టన్నుకు వసూలు చేయవలసిన సీనరేజి ధరలు నిర్ణయించింది. అదే రూల్ కూటమి ప్రభుత్వం కూడా అనుసరిస్తూ గతంలో సీనరేజి వసూలు చేసిన వ్యక్తులకే అప్పగించింది. కానీ కాంట్రాక్టు సంస్థ ఇష్టానుసారం దోపిడీ చేస్తోంది. అధికారిక నిర్ణయం ప్రకారం వసూలు చేయవలసిన చార్జీలు వివరాలిలా ఉన్నాయి. గ్రానైట్ ధర టన్నుకు రూ.145, బాల్‌కేకు రూ.75, బ్రైటీస్ గ్రేకలర్ ఏగ్రేడ్ ధర రూ.480, బిగ్రేడ్‌కు రూ.355, సీ, డీ, వేస్ట్ గ్రేడ్‌లకు రూ.220, వైట్ కలర్‌కు రూ.1100, ఇతర రకాల ఆఫ్ కలర్ రూ.500 వంతున సీనరేజి వసూలు చేయాలి. బిల్డింగ్ స్టోన్‌కు సంబంధించి క్యూబిక్ మీటర్‌కు రూ.90, టన్నుకు రూ.60, కాల్‌కేరియస్ సాండ్‌కు రూ.90, కాల్‌సైట్‌కు రూ.90, చాల్‌సెడోని పెబ్బల్స్ క్యూబిక్ మీటరుకు రూ.90, టన్నుకు రూ.60, చాల్క్‌కు రూ.95, చైనా క్లేకు రూ.60, ఇతర రకాల క్లేకు రూ.60, కోరండమ్‌కు రూ.120, డయాస్పోర్‌కు రూ.415, క్యూబ్స్, కెర్బ్స్‌కు వినియోగించే డైమెన్షనల్ స్టోన్‌కు రూ.135, డోలోమైట్‌కు రూ.100, డునైట్ లేదా పైరాక్సినైట్‌కు రూ.60, ఫెల్స్‌పర్‌కు రూ.100, ఫెల్‌సైట్‌కు రూ.130, ఫైర్‌క్లేకు రూ.60, ఫుల్లర్స్ ఎర్త్, బెంటోనైట్‌కు రూ.180. ఫుచైట్ క్వార్ట్జ్‌కు రూ.90 వసూలు చేయాలి. గ్రానైట్ కటింగ్, పాలీసింగ్‌కు సైజ్‌ను బట్టి వివిధ చార్జీలు నిర్ణయించారు. బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ సైజ్‌ను బట్టి క్యూబిక్ మీటరుకు రూ.4600, టన్నుకు 1415 నుంచి క్యూబిక్ మీటరు 1550, టన్నుకు రూ.480 ఉంది. బ్లాక్ గ్రానైట్, ఆయా జిల్లాల్లోని రకాలను బట్టి కూడా చార్జీలు నిర్ణయించారు. కానీ సీనరేజ్ దోపిడీ జరుగుతోంది.

ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి కాకినాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంపై కమిషనర్ భావన నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వీధులు, డ్రైన్లు, పబ్లిక్ టాయిలెట్లను శుభ్రపరచడం, పార్కుల్లో తుప్పల తొలగింపు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాల షెడ్యూల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర ప్రజలు కూడా కాకినాడను పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, మేనేజర్ సత్యనారాయణ, ఆర్‌ఓ శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన

నేడు జిల్లాలో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వేచ్ఛ దివాస్'

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా జేసీ రాహుల్‌మీనా, కాకినాడ కమిషనర్ భావనతో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, భవిష్యత్ తరాలవారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ భారతి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చౌకధరల దుకాణాలకు పరీక్ష

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న చౌకధరల దుకాణాలకు సంబంధించి రాతపరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సంబంధిత హాల్‌టికెట్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొందాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు సూచించారు. అభ్యర్థులు చౌకధరల దుకాణాలకు సంబంధించి ఏవిధమైన దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ప్రతిభ ఆధారితంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు.

మేనరికపు వివాహాలు, కుష్ఠు వ్యాధిపై అవగాహన గోడపత్రిక ఆవిష్కరణ

కరపత్రాలనూ ఆవిష్కరించిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): మేనరికపు వివాహాలు, కుష్ఠు వ్యాధిని గుర్తించి అవగాహన కల్పించడంపై గోడపత్రిక, కరపత్రాలను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాధికారి నరసింహనాయక్, డాక్టర్లు రమేష్, చక్రధర్, సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో మేనరికం వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈనెల 20వతేదీనుంచి వచ్చే నెల 2వతేదీ వరకు 14రోజులపాటు కుష్ఠు వ్యాధి గుర్తింపు నివారణకు అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ వ్యాధిపై సర్వే జరుగుతుందన్నారు. అనుమానాస్పదంగా ఉన్న మచ్చలను గుర్తించి వైద్యులు పరీక్షిస్తారన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న 76వ గణతంత్ర వేడుకలకు పటిష్టమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం వివేకానంద హాలులో గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ ఉదయం 9గంటలకు కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. ఈ వేడుకలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొననున్న దృష్ట్యా పటిష్టమైన బందోబస్తుతో విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వేడుకలకు హాజరయ్యే ప్రముఖులతోపాటు ప్రతి ఒక్కరికీ తగిన సీటింగ్ ఏర్పాట్లు, ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి వసతి, పారిశుధ్యనిర్వహణ, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

పిఠాపురం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక లాడ్జిలో ఓ ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో పోలీసులు అతడి మృతదేహాన్ని గుర్తించారు. అనకాపల్లి జిల్లా మాకవారిపాలెం మండలం బూరుగుపాలెం గ్రామానికి చెందిన జి.భరత్‌గా భావిస్తున్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.



ఆర్మీ ఉద్యోగి భరత్ మృతదేహం

కొమరగిరి లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్

కొత్తపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం కొమరగిరి మెగా లేఅవుట్‌ను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ కాకినాడ అర్బన్‌కు కేటాయించిన ఇళ్లస్థలాలకు దారి మార్గం ఏర్పాటు పై ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన లేఅవుట్‌ను కలెక్టర్ పరిశీలించారు. దారి మార్గం ఏర్పాటుపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. జేసీ రాహుల్‌మీనా, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, కొత్తపల్లి తహసీల్దార్ జి.చిన్నారావు, ఆర్ఐ మధుసూదనరావు కలెక్టర్ వెంట ఉన్నారు.



కొమరగిరి లేవుట్‌లో మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

విద్యతోపాటు క్రీడలు అవసరమే

3

- ఎమ్మెల్యే చినరాజప్ప
- 'శ్రీప్రకాష్'లో ప్రారంభమైన జాతీయస్థాయి చెస్ పోటీలు

అపు'రూపాలు'



చిత్రకళారూపమొందిన శిల్పకళా నైపుణ్యం.. (సూపర్ గోల్డెన్ పద్మ అవార్డు)
ఆర్టిస్ట్ : ఎన్.భాగవతిసుందరం, శివకాశీ

నేడు చిత్రకళా బ్రహ్మోత్సవం వేదిక ప్రారంభం.. బాలలకు పోటీలు

రేపు అమలాపురంలో అంతర్జాతీయ చిత్ర కళాప్రదర్శన

ప్రకృతి రమణీయత.. సృష్టిలోని చిత్రవిచిత్రాలు.. కోట్ల ప్రాణుల తన్మయత్వ రూపాలు.. ఇలా ఒక్కటేమిటి చిత్రకారుల కుంచెల నుంచి ఎన్నెన్నో అద్భుత చిత్రాలు జాలువారాయి. ఒక చిత్రం చరిత్రను చెబుతుంటే.. మరో చిత్రం ప్రపంచ దేశాల సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తుంది. కోనసీమ చిత్రకళా పరిషత్ ఈనెల 19న నిర్వహించే 35వ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనకు ఎంపికైన చిత్ర రాజాలను మీరూ వీక్షించండి!

అమలాపురం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ చిత్రకళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 19న 35వ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన ఏర్పాటుచేశారు. అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపం చిత్రకళా ప్రదర్శనకు వేదిక కానుంది. చిత్రకళా ప్రదర్శనకు గల్ఫ్ దేశాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిసా, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, అస్సాం, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన చిత్రకారుల కుంచెల నుంచి జాలువారిన చిత్రాలను ఈ ప్రదర్శనలో ఉంచుతారు. పండితుల నుంచి పామరుల వరకు, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరినీ ఆకట్టుకునేలా ఎన్నెన్నో అద్భుత చిత్రాలు ప్రదర్శనలో కనువిందు చేయనున్నాయి.

చిత్రకళా బ్రహ్మోత్సవ వేడుకలు..


కోనసీమ చిత్ర కళాపరిషత్ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు మెట్ల రమణబాబు తెలిపారు. ప్రముఖ చిత్రకారుల కుంచెల నుంచి జాలువారిన 500 చిత్రాలను ఈ ప్రదర్శనలో ఉంచుతారు. ప్రముఖ చిత్రకారులు బాపు, వడ్డాది పాపయ్య, నీలి వెంకటరమణ, డిజిటల్ రవి చిత్రాలను కూడా ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తున్నారు. 29వ తేదీ ఉదయం 34వ అంతర్జాతీయస్థాయి చిత్రకళా పోటీల విజేతలుగా నిలిచిన వంద మంది విజేతలకు బహుమతులు అందజేస్తారు. అనంతరం 35వ చిత్రకళాపోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 215 మంది చిత్రకారులను మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ సత్కరిస్తారని తెలియజేశారు.




నృత్యకళా భంగిమ..
(భారత చిత్రకళారత్న గోల్డెన్ అవార్డు)
ఆర్టిస్ట్ : దేవేంద్ర ఎం బాదీగర్ , కర్నాటక



మానవ మృగ సంహారం..
(అమరావతి చిత్రకళారత్న గోల్డెన్ అవార్డు)
ఆర్టిస్ట్ : డాక్టర్ నీతా శ్రీవాస్తవ, జబల్‌పూర్



అన్వేషి.. (భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవం అవార్డు)
ఆర్టిస్ట్ : రాజీబ్ అగర్వాల్, జార్ఖండ్



అమ్మప్రేమ.. (భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవం అవార్డు)
ఆర్టిస్ట్ : హేమ కుట్నీకర్, మహారాష్ట్ర



చిగురించిన ఆశలు.. (మెగా గోల్డెన్ పద్మ అవార్డు) ఆర్టిస్ట్ డాక్టర్ సుష్మా శ్రీవాస్తవ, భోపాల్

నేడు బాలల చిత్రకళా పోటీలు..

చిత్రకళ బ్రహ్మోత్సవంలో భాగంగా శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణమండపంలో బాలల చిత్రకళా పోటీలను నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి కొరసాల సీతారామస్వామి తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు చిత్రకళా బ్రహ్మోత్సవం వేదికను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రారంభించి లోగోను డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆవిష్కరిస్తారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి జ్యోతి ప్రజ్వలనతో చిత్రకళా బ్రహ్మోత్సవం ప్రారంభమవుతుందన్నారు.



రేపు అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన

కొరసాల సీతారామస్వామి, కోనసీమ చిత్ర కళా పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి

కోనసీమ చిత్రకళాపరిషత్‌ను 1989లో ఏర్పాటుచేశాం. 35 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా చిత్రకళా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నాం. దీనిలో భాగంగా అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన ఏర్పాటుచేశాం. అంతర్జాతీయ ఖ్యాతినొందిన ఎందరో చిత్రకారుల కుంచెల నుంచి జాలువారిన కళారాజాలను ఈనెల 19వ తేదీన జరిగే ప్రదర్శనలో ఉంచుతాం. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినొందిన చిత్రకారుల చిత్రాలతో రూపొందించిన అవర్ ఆర్టిస్ట్స్ బోర్న్ టూ ఎక్సెల్ రూపొందించిన పుస్తకాన్ని ముఖ్య అతిథులందరికీ అందజేస్తాం.

కమ్మేసిన పొగమంచు

- రోజంతా ఇదే పరిస్థితి
- రాత్రి వేళ రహదారులు కనిపించక ఇక్కట్లు
- పెరిగిన చలి తీవ్రత



పిఠాపురం పట్టణ శివారులో జాతీయ రహదారిపై దట్టంగా అలముకున్న పొగమంచు

పిఠాపురం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పొగమంచు కమ్మేసింది. రహదారులు, పంటపొలాలు మీదుగా రోజంతా దట్టంగా ఆవరించి ఉంటోంది. తెల్లవారుజామున మంచు అధికంగా ఉండడంతో ప్రయాణాలు సాగించడం కష్టంగా మారి వాహనాలు నిలిపివేస్తున్నారు.

చలి తీవ్రత మళ్లీ పెరుగుతుండడంతో పాటు పొగమంచు ప్రభావం అధికమవుతోంది. రాత్రి పగలు భేదం లేకుండా రహదారులు, పంటపొలాలు, గృహాలు మీదుగా మంచు దుప్పటి మాదిరిగా ఆవరించి కనిపిస్తోంది. మధ్యాహ్న సమయంలోను పొగమంచు ప్రభావం తగ్గడం లేదు. 216వ జాతీయరహదారిపై పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల మధ్య గలరహదారి పొగమంచు వలయంలో చిక్కుకుంది. ఉదయం 11గంటల వరకూ మంచు ప్రభావం తగ్గకపోగా మధ్యాహ్నం 2గంటలు నుంచి మళ్లీ అధికవుతోంది. 15రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనగా, గురు, శుక్రవారాల్లో మరింత అధికమైంది. రాత్రయ్యేసరికి ఎదురుగా వచ్చిన వాహనాలు కనబడక అవస్థలు పడుతున్నారు. సాయంత్రంనుంచే కొందరు వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు.

అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు

పొగమంచు ప్రభావం అధికంగా ఉన్నందున ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురికాక తప్పని స్థితి. ఇటీవల కాలంలో 216, 16వ జాతీయ రహదారులపై అధికసంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇవన్నీ అర్ధరాత్రి, తెల్లవారు సమయాల్లో జరిగినవే. రోడ్డు కనబడక పలువురు వాహనదారులు తమ వాహనాలను పక్కకు తీసి నిలిపివేస్తున్నారు. వీటిని మంచులో గమనించక వాటిని ఢీకొనడం, లేదా డివైడర్లను ఢీకొని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

తగ్గినట్టే తగ్గి...

చలితీవ్రత తగ్గినట్లే తగ్గి శుక్రవారం నుంచి మళ్లీ తీవ్రమైంది. ఆకాశంలో మేఘాలు అలముకుని కొంత సమయం ఎండ, మరికొంత మబ్బులు ఉండి శీతల గాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిఠాపురం,గొల్లప్రోలు పట్టణాలతోపాటు జిల్లాలోని అన్నిప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28-30 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 16-18 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి.



పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్య గల పంటపొలాలు మీదుగా ఆవరించిన మంచు



రాములవారి పంచలోహ విగ్రహాన్ని అందజేస్తున్న శిల్పి శ్రీనివాసరావు

పంచలోహాలతో రాములవారి విగ్రహం

రూ.2 లక్షల సొంత ఖర్చుతో తయారు చేసిన శిల్పి శ్రీనివాసరావు

అయోధ్య రామ మందిరం ట్రస్టు ప్రధాన కార్యదర్శికి అందజేత

మండపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన ప్రముఖ శిల్పాల తయారీదారుడు వాసా శ్రీనివాసరావు రూ.2లక్షల సొంత ఖర్చుతో పంచలోహాలతో రాములవారి విగ్రహం తయారు చేశాడు. దీనిని అయోధ్య రామ మందిరం ట్రస్టుకు అందజేయాల్సిందిగా హైదరాబాద్‌కు చెందిన సీతారామ ఫౌండేషన్ ట్రస్టు ఛైర్మన్ చల్లా శ్రీనివాసశాస్త్రికి ఇచ్చారు. కాగా మహా కుంభమేళాలో పాల్గొనేందుకు కుటుంబీకులు, బంధుమిత్రులతో ప్రయాగరాజ్ వెళ్లిన శిల్పి శ్రీనివాసరావు గురువారం రాత్రి ఈ విగ్రహాన్ని అయోధ్య రామ మందిరం ట్రస్టు ప్రధాన కార్యదర్శి సంపత్రాయ్‌కు అందజేశారు. ఉత్సవ విగ్రహాన్ని భక్తులు దర్శించుకోవడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో మండపేట పట్టణానికి చెందిన వాసా పల్లంరాజు, గాడేపల్లి శ్రీనివాస్, వేగుళ్ల శ్రీనివాస్, ఎల్.రఘుబాబు, అల్లం ఏడుకొండలు పాల్గొన్నారు.



వీటీడీఏల లక్ష్యానికి

ఐటీడీఏ తూట్లు

25 ఏళ్ల క్రితం చంద్రబాబు రూపొందించిన గిరిజన వృద్ధి విజన్‌ను నిర్వీర్యం చేసిన రంపచోడవరం ఐటీడీఏ అధికారులు

నిర్మాణ పనులన్నీ గిరిజనులకే అప్పగించే దిశగా తదనంతర చర్యల విస్మరణ

రూ.10 లక్షలు విలువను పెంచకపోగా కనీస పనులూ అప్పగించని వైనం



(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

విలేజ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ)... 'గిరిజన భాగస్వామ్యంతోనే గిరిజనాభివృద్ధి' నినాదంతో 1999లో చంద్రబాబు సారథ్యంలో టీడీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను తీసుకొచ్చింది. 25ఏళ్ల క్రితం చంద్రబాబు విజన్‌లో భాగంగా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను గిరిజనులతోనే చేయించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని నిశ్చయించి జీవో నెం.30 ద్వారా మార్గదర్శకాలు జారీ చేశారు. తద్వారా రూ.10లక్షలలోపు పనులను వీటీడీఏ ద్వారా చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామాల అభివృద్ధితో పాటు గిరిజనులకు ఉపాధి లభించింది. తదనంతరం కాలంలో ఈ వ్యవస్థను నడిపించాల్సిన రంపచోడవరం ఐటీడీఏ అధికారులే దీనికి తూట్లు పొడిచారు.

వీటీడీఏలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని భావించి రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించే పద్ధతిని క్రమబద్ధీకరించారు. అన్ని శాఖల నిధులూ వీటీడీఏల ద్వారానే గ్రామస్థాయిలో వెచ్చించాలనేది ఈ విధానంలో కీలకం. 20 కుటుంబాలకు తక్కువ కాకుండా ఉండే ప్రతి జనావాసంలోనూ వీటిని ఏర్పాటు చేశారు. నేడు ఈ వీటీడీఏలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర నిధులతో మౌలిక వనరుల నిర్మాణాలు సాగుతున్నా వీటీడీఏలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేసి, గ్రామస్థాయి అభివృద్ధి పనులన్నీ గిరిజనులతోనే చేయించాలన్న ఊసే అధికారులకు లేకుండా పోయింది. క్రమేణా అధికారులే ఈ వీటీడీఏలను నిర్వీర్యం చేశారు. ప్రస్తుతం మన్యంలో అన్ని ఇంజనీరింగ్ శాఖల పనుల్లో మెజారిటీ పనులు గిరిజనేతర కాంట్రాక్టర్ల గుప్పెట్లోనే నడుస్తున్నాయి. గిరిజనులు కేవలం ఆయా పనుల్లో పని చేస్తున్నారు. తమ గ్రామాల్లో సాగే పనులను తామే నిర్వహించుకోవచ్చన్న ఆలోచనే వారికి లేకుండా ఇంజనీరింగ్ శాఖలు వ్యవహరిస్తున్నాయి.



రోడ్డు నిర్మాణం కోసం కొండను చదును చేస్తున్న గిరిజనులు (పాత చిత్రం)

మన్యంలో సుమారు 800కు పైగా వీటీడీఏలు ఉన్నాయి. ఇవి ఉన్న గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నా అవన్నీ వీటీడీఏలకు తెలియకుండానే జరుగుతున్నాయి. అసలు వీటీడీఏలు అమలులో ఉన్నాయన్న విషయమే తెలియని అధికారులు కూడా ఉన్నారు. వీటీడీలు అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వానికి గిరిజన గ్రామాల్లో పట్టు ఉండేది. అధికారులు దళారీ విధానాలనే ప్రోత్సహించడంతో క్రమేణా ప్రభుత్వానికి గ్రామాలపై పట్టు సడలింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి వీటికి ఎన్నికలు జరపాల్సి ఉండగా చాలా ఏళ్లుగా వీటికి ఎన్నికలే లేవు.

వీటీడీఏలు చేపట్టే పనుల పరిధిని 25 ఏళ్ల క్రితం ఉన్న రూ.10లక్షలు నుంచి కనీసం రూ.50లక్షలకు పెంచితే ఆయా విలువ కలిగిన పనులు ఆయా గ్రామాల్లో గిరిజనుల పరిపుష్టికి దోహదపడతాయి. ఎంతటి పెద్ద పనినైనా రీచ్‌ల పద్ధతిలో విభజించితే అన్ని పనులూ వీటీడీఏల ద్వారా చేయించే వీలు కలుగుతుంది. త్వరలో విజన్-2047 డాక్యుమెంటు రూపకల్పన నేపథ్యంలో గిరిజనాభివృద్ధికి సంబంధించిన వీటీడీఏల కీలకం కానుంది. ప్రస్తుతం చీఫ్ సెక్రటరీగా ఉన్న విజయానంద్ మూడు దశాబ్దాల క్రితం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పని చేసినందున విజన్ డాక్యుమెంటులో గిరిజనుల భాగస్వామ్యానికి ప్రాధాన్యమిస్తే గిరిజనాభివృద్ధికి సార్థకత చేకూరుతుంది.



షెడ్యూలు ప్రకటించారు...

ఎన్నికల ఊసు మరిచారు

ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న చేనేత సహకార సంఘాలు

అప్పటివరకు ప్రత్యేక అధికారుల పాలనలోనే...

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అయితే వాటికి పునరుజ్జీవం పోసే దిశగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు చేపట్టిందని అందరూ ఆనందించారు. అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూలు ప్రకటించింది. ఆ తర్వాత దాని ఊసే ఎత్తలేదు. నవంబరు 21న ప్రక్రియ ప్రారంభించి డిసెంబరు 6కి పూర్తి చేయాల్సి ఉంది. అందుకు అనుగుణంగా అధికారులు కూడా ఏర్పాట్లు చేశారు. ఎన్నికలు జరిగి ఉంటే ఈ పాటికి కొత్త పాలకవర్గాలు కొలువుదీరి ఉండేవి. అయితే ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం కనిపించట్లేదు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన చేనేత సంఘాలు 50 వరకు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 18, తూర్పు గోదావరి జిల్లాలో 9, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 23 ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిర్లిప్తంగా ఉన్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియక అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

తప్పని నిరీక్షణ

2013 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరితో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో చేనేత కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే వరకు ప్రత్యేక అధికారులే కొనసాగనున్నారు.

సత్యదేవుడికి జన్మ నక్షత్ర పూజలు

అన్నవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా శుక్రవారం మూలవరులకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేకువజామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపజేశారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకించారు. సుగంధభరిత పుష్పాలతో అలంకరించి నూతన పట్టువస్త్రాలను ధరింపజేశారు. పది గంటలకు ఆయుష్య హోమం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

విద్యతోపాటు క్రీడలు అవసరమే

ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం 'శ్రీప్రకాష్'లో ప్రారంభమైన జాతీయస్థాయి చెస్ పోటీలు

పెద్దాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు బాలలకు క్రీడలు కూడా ఎంతో అవసరమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఐదురోజులపాటు జరగనున్న జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను జ్యోతీ ప్రజ్వలన చేసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల పట్ల మక్కువను పెంచుకోవాలన్నారు. క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. ముఖ్యంగా చెస్ ద్వారా మేధాశక్తి పెంపొందుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీశర్మ మాట్లాడుతూ జాతీయస్థాయిలో చెస్ పోటీలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. సాటిమేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దబడాలంటే నిరంతర సాధన అవసరమన్నారు. నిత్య సాధనతోనే మంచి ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు మాట్లాడుతూ పెద్దాపురంలో ఇటువంటి క్రీడాపోటీలు జరగడం గర్వకారణమని అందుకు శ్రీప్రకాష్ పాఠశాల వేదిక కావడం సంతోషదాయకమన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ 5 రోజులపాటు చెస్ పోటీలు జరుగుతాయని, సుమారు 1200మంది క్రీడాకారుల హాజరుకానున్నట్లు చెప్పారు. జాతీయస్థాయి పోటీలను తమ పాఠశాలలో ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.



పోటీలను ప్రారంభించి చెస్ ఆడుతున్న చినరాజప్ప


చెస్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సందేశాన్ని ఇస్తూ.. చరిత్రను తెలియజేస్తూ..

భోగాపురంలో జాతీయస్థాయి నాటిక పోటీల్లో ఆలోచింపజేసిన ప్రదర్శనలు


భోగాపురంలో ప్రదర్శించిన ద్వారబంధాల చంద్రయ్యానాయుడు నాటికలో ఓ సన్నివేశం


ప్రేమించే వయసేనా నాటికలో సన్నివేశం

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): డిల్లీలో ఉన్న వాయు కాలుష్యం కంటే సాంస్కృతి కాలుష్యం ప్రమాదకరమైందని, దీనిని మనస్సు దరి చేరనివ్వద్దు అంటూ సందేశాన్ని ఇస్తూ, అదే సమయంలో రంప విప్లవ వీరుడు చరిత్రను తెలియజేస్తూ నాటికలు సందేశాత్మకంగా సాగాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక పోటీల తొలిరోజున ప్రదర్శించిన నాటికలు అందరిని ఆలోచింపచేశాయి. గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం టి.కృష్ణ ఆర్ట్ థియేటర్స్ కళాకారులు ప్రదర్శించిన ప్రేమించే వయసేనా నాటిక ద్వారా టీనేజీలో ప్రేమలో పడటం ద్వారా విలువైన జీవితాన్ని కోల్పోవద్దు అంటూ సూచించారు. 18 ఏళ్ల నిండితే కాని మనకు విచక్షణ రాదు. ఓటు హక్కు ఇవ్వడం లేదు. అటువంటప్పుడు జీవితాంతం తోడుగా ఉండే భాగస్వామిని ఎలా ఎన్నుకోగలం అంటూ నాటిక ద్వారా ప్రశ్నించారు. ఒక మాస్టారి కూతురు తల్లిదండ్రుల మాట వినకుండా ప్రేమలో పడుతోంది. ఇంట్లో పెళ్లి నిశ్చయించినా కాదని ప్రియుడి దగ్గరకు వెళ్లిపోతుంది. తల్లికి పక్షవాతం రాగా.. కొన్నాళ్లకు కూతురు మోసపోయి తిరిగి వారి వద్దకు వస్తుంది. తల్లిదండ్రులు కూతురు పట్ల చూపిన ప్రేమ, దానిని కాదని ప్రేమ అనే ఆకర్షణలో పడి వెళ్లిపోవడం అంశాలను నాటికలో చూపించారు. జరుగుల రామారావు, దండా అనంతబాబులు రచించగా, రామారావు దర్శకత్వం వహించారు.

చరిత్ర విస్మరించినా..

తొలి స్వాతంత్ర్యయోధుడు, దేశం కోసం దేహత్యాగం చేసిన రంప విప్లవవీరుడు చంద్రయ్యనాయుడిని చరిత్ర విస్మరించిందని, గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటిక ద్వారా అతని చరిత్రను చాటిచెప్పారు. అల్లూరి సీతారామరాజు కంటే 4 దశాబ్దాలకు ముందే మన్యసీమలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమించడమే గాక, జమీందార్లను కొల్లగొట్టి పేదలకు పంచారని, ఒరిస్సా నుంచి గోదావరి మండలం వరకూ తన పోరాటాలు సాగించారని వివరించారు. నాటికను పీవీ సత్యనారాయణ రచించగా, పి.కృష్ణహితేష్ దర్శకత్వం వహించారు.

తోపులాట కారణంగా...

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

సర్పవరం జంక్షన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా టెంట్ వేసే క్రమంలో ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదం వ్యక్తి మృతికి కారణంగా నిలిచింది. కాకినాడ రూరల్ మండలం వలసపాకల బీసీపేటకు చెందిన గుబ్బల శ్రీను (34), కోశబోయిన రామదాసులు పక్కపక్కనే నివాసం ఉండేవారు. వారిద్దరు స్నేహితులు. సంక్రాంతి పండుగ సందర్భంగా వలసపాకలలో టెంట్లు వేసేందుకు రామదాసు పని తీసుకుని నలుగురు వ్యక్తులను పనిలో పెట్టాడు. ఇందులో గుబ్బల శ్రీను ఉన్నాడు. ఈనెల 12వ తేదీన సాయంత్రం 5 గంటల సమయంలో టెంట్లు వేసే చోట గుబ్బల శ్రీను, కేసబోయిన రామదాసు మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. ఈ క్రమంలో గుబ్బల శ్రీనుని బలంగా రామదాసు కడుపులో తన్నడంతో నొప్పితో జనవరి 13న రాత్రి ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం కోసం చేరాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం శ్రీను మృతిచెందాడు. దీనిపై సర్పవరం ఎస్ హెచ్‌వో బి.పెద్దిరాజు ఎమ్మెల్సీ కేసుగా స్వీకరించి హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. శ్రీనుని భార్య వదిలేసిందని కామెంట్ చేయడంతో ఇద్దరి మధ్య తోపులాట జరిగి కడుపులో తన్నడంతో శ్రీను మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి సాయిశ్రీ, ఒక బాబు, బాలిక ఉన్నారు.


మృతి చెందిన గుబ్బల శ్రీను

160 రకాలతో....

కొత్త అల్లుడికి విందు భోజనం


పిఠాపురంలో కొత్త అల్లుడికి వడ్డించిన 160 రకాల వంటకాలు

పిఠాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కొత్త అల్లుడికి 160 రకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన పాదగయ మాజీ చైర్మన్ కొత్తెం పశువులరావు(దత్తుడు), రాణి దంపతులు తమ కుమార్తె సాగరికను ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చక్కపల్లి నటరాజ్ ఆకాష్‌తో వివాహం చేశారు. పండుగకు తమ ఇంటికి వచ్చిన ఆకాష్‌కు శుక్రవారం 160 రకాల పిండివంటలు, స్వీట్లు, కూరలు, పండ్లు, జ్యూస్‌లు, బిరియానీలతో విందు భోజనం వడ్డించారు.

సినీ దర్శకుడు పరశురామ్ పూజలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయాన్ని ప్రముఖ సినీ దర్శకుడు పరశురామ్ సందర్శించారు. సతీసమేతంగా అపర్ణాదేవిని దర్శించుకుని సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యాన్ని వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రి వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ పరశురామ్ దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, అమ్మవారి కుంకుమను అందజేశారు. వారి వెంట జనసేన మండలాధ్యక్షుడు అమరాది వల్లీ రామకృష్ణ, కమిటీ సభ్యులు చెరుకు శ్రీను, అడపా నూకరాజు ఉన్నారు.


తాటిపర్తిలో పరశురామ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

506 మంది హాజరు

కాకినాడ క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 12వ రోజైన శుక్రవారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలకు మొత్తం 506 మంది హాజరయ్యారు. తదుపరి పరీక్షకు 350 మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సామర్థ్య పరీక్షలను శుక్రవారం కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అడ్మిన్ ఎస్పీ ఎంజెవి.భాస్కర్‌రావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావ్ పర్యవేక్షించారు.


లాంగ్ జంప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

చేనేత కార్మికులకు రూ.21.78 లక్షలు త్రిఫ్ట్ నిధులు విడుదల

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చేనేత కార్మికులకు రూ.21.78 లక్షలు త్రిఫ్ట్ నిధులు విడుదల అయినట్లు జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ కె.పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. చేనేత కార్మికులకు త్రిఫ్ట్ నిధులు అంశం గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో కార్మికులకు అందాల్సిన ఆ నిధులు అందకుండా పోయాయి. తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల నిధులను విడుదల చేసింది. 2018, జూలై 1 నుంచి అక్టోబరు 30 వరకు మూడు నెలలకు గాను ఒక క్వార్టర్‌కి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 20చేనేత సహకార సంఘాల కార్మికులకు రూ.10.84లక్షలు... 2019, జనవరి 1 నుంచి మార్చి 31 వరకు మరో క్వార్టర్‌కి 28 సంఘాల కార్మికులకుగాను రూ.10.93లక్షలు ఏడీ తెలిపారు. విడుదలైన నిధులను ఆయా సంఘాలకు జమ చేస్తామని సంఘాల నుంచి కార్మికులకు అందుతాయని తెలిపారు. మిగిలిన బకాయిలు కూడా విడతల వారీగా విడుదలవుతాయని, అందుకు నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఏడీ తెలిపారు.

అత్యుత్సాహం... అతి ప్రమాదం!

- సెలవు రోజుల్లో కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు తరలివస్తున్న సందర్శకులు
- పోలీసులు లేని ప్రాంతాలకు వెళ్లి సముద్ర స్నానాలు
- కెరటాల ధాటికి గల్లంతవుతున్న యువకులు

కుటుంబ సభ్యులతో ఆహ్లాద వాతావరణంలో గడిపేందుకు కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అనేకమంది సందర్శకులు వస్తూంటారు. అయితే ఇక్కడ సముద్రంలో లోపలికి వెళ్లి స్నానాలు చేయాలని కొందరు అత్యుత్సాహం చూపి ప్రమాదంలో పడిపోతున్నారు. దీంతో సముద్ర కెరటాల రూపంలో మృత్యువు ఏటా యువకులను బలితీసుకుంటుంది. సందర్శకులు బీచ్‌లో స్నానాలు చేస్తూ కెరటాల ధాటికి గల్లంతై మృత్యువాత పడుతున్నారు. జనవరిలోనే ముగ్గురు యువకులు సముద్ర స్నానాలు చేస్తూ కెరటాల ఉధృతికి గల్లంతై మృత్యువాత బారిన పడటం తల్లిదండ్రులను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది.


ఎన్టీఆర్ బీచ్‌లో సందర్శకుల కోలాహలం (ఫైల్‌ఫొటో)

సర్పవరం జంక్షన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ సాగరతీరంలో గడిపేందుకు చిన్నారులు, యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో తరలివస్తూంటారు. శని, ఆదివారం, సెలవుల సమయాల్లో వేలాది మంది సందర్శకులు తరుచూ విచ్చేసి సముద్రంపై నుంచి వీచే చల్లనిగాలులకు సేదతీరుతూంటారు. కాకినాడ కుంభాభిషేకం నుంచి ఉప్పాడ వరకు సుమారు 17 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ఇందులో సూర్యారావుపేట లైట్‌హౌస్ నుంచి నేమాం గెస్ట్‌హౌస్ వరకు సాగరతీరం ఉండడంతో నిత్యం అనేక మంది వచ్చి సముద్రంలో స్నానాలు చేస్తుంటారు. వినోద, విహార యాత్రల పేరుతో యువకులు, చిన్నారులు, పెద్దలు బీచ్‌కు వస్తూంటారు. ఆహ్లాదం కోసం వచ్చే యువకులు సముద్ర కెరటాల తాకిడి, ఉధృతిని అంచనా వేయలేక కెరటాల్లో చిక్కుకుని గల్లంతై మృత్యువాత పడుతున్నారు. దాంతో విహార, వినోద యాత్ర కాస్తా కుటుంబ సభ్యులకు తీరని పుత్రశోకం మిగులుస్తోంది.

కొత్త సంవత్సరంలో ముగ్గురి మరణం

కొత్త సంవత్సరం ఒకటో తేదీన సాగరతీరంలో గడిపేందుకు వెళ్లి సముద్రంలో స్నానం చేస్తూ అలల ఉధృతికి గల్లంతై ముగ్గురు యువకులు మృతి చెందారు. కొత్తపల్లి మండలం కోన పాపపేట శివారు మల్లివారితోటకు చెందిన గుత్తుర్తి సతీష్ కుమార్ (17), కాకినాడ రామకృష్ణారావుపేట ఎర్రరోడ్డుకు చెందిన వడిసెల గౌరీ లక్ష్మీ నాగసాయి (16), బొర్ర శ్రీనుబాబు (17) నూతన సంవత్సరం సందర్భంగా సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కెళ్లి సముద్రంలో స్నానం చేస్తూ అలల ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందారు. గడచిన అయిదేళ్లలో తిమ్మాపురం, సర్పవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 22 మంది మృతిచెందారు. సముద్ర తీరంలో వాకలపూడి మెరైన్ పోలీసులు సుమారు 10 మంది, తిమ్మాపురం పోలీసుల ఆధ్వర్యంలో గస్తీ నిర్వహిస్తూంటారు. సముద్రంలో స్నానాలు చేయకుండా వాకీటాకీలు, మైక్ ద్వారా హెచ్చరికలు చేస్తూ అప్రమత్తం చేస్తూంటారు. లైట్‌హౌస్ నుంచి నేమాం వరకు ఉన్న సముద్రతీరంలో పోలీసులు లేని ప్రాంతాలకు వెళ్లి యువకులు సముద్రస్నానాలు చేస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని శని, ఆదివారాల్లో రద్దీగా ఉండే సమయంలో మరింత మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నా యువకుల మరణాలు తగ్గకపోవడం కలవరపాటుకి గురి చేస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం

సముద్రం లోపలి కెళ్లి స్నానాలు చేయవద్దని, ప్రమాదం పొంచి ఉందని యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎస్‌ఐ ఆధ్వర్యంలో సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నాం. శని, ఆదివారం, సెలవుల రోజుల్లో ప్రత్యేకంగా గజ ఈతగాళ్లను తీరంలో అందుబాటులో ఉంచుతున్నాం. యువకులు సముద్రంలో స్నానాలు చేయాలన్న కోరికతో పోలీసులు లేని ప్రాంతాలకు వెళ్లి, సముద్ర స్నానాలకు దిగి చేజేతులా ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదకర బీచ్‌లో ప్రత్యేక హెచ్చరికల బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

రామ్మోహన్‌రెడ్డి, సర్కిల్ ఆఫీసర్, మెరైన్ పోలీస్‌స్టేషన్

మహిళ మృతిపై అనుమానం

మృతదేహానికి పోస్టుమార్టం


మహాలక్ష్మి(ఫైల్)

ద్రాక్షారామ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం తోటపేటలో మహిళ మృతిపై ఫిర్యాదు రావడంతో అంత్యక్రియలు జరిపిన మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తోటపేట గ్రామానికి చెందిన దామిశెట్టి మహాలక్ష్మి(58) తోట త్రిమూర్తులు కాలనీలో నివాసం ఉంటుంది. భర్త మృతిచెందడంతో ఒంటరిగా నివాసం ఉంటూ ద్రాక్షారామలో శ్రీదేవిస్టీలు హౌస్‌లో పనిచేసేది. ఆమె దత్తత కుమార్తె నాగలక్ష్మిని కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన సలాది సురేష్‌కు ఇచ్చి వివాహం చేసింది. రోజూ నాగలక్ష్మీతో పాటు బంధువులు మహాలక్ష్మికి ఫోన్ చేసి మాట్లాడుతుండేవారు. ఈనెల 11న నాగలక్ష్మితో పాటు బంధువులు మహాలక్ష్మికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో ఈనెల 12న ఉదయం 7గంటల సమయంలో తోటపేట గ్రామానికి చెందిన దామిశెట్టి వీరబాబు మహాలక్ష్మి అల్లుడికి ఫోన్ చేసి మీ అత్తయ్య ఇంట్లో పడిపోయి ఉందని, ఏమీ మాట్లాడటం లేదని చెప్పాడు. దీంతో సురేష్ భార్యతో కలసి వచ్చిచూడగా మహాలక్ష్మీ మృతిచెందిఉంది. ద్రాక్షారామ శ్మశానవాటికలో క్రైస్తవ సంప్రదాయం ప్రకారం మృతదేహం శవపేటికలో ఉంచి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే మహాలక్ష్మి మెడలో ఉండవలసిన బంగారు గొలుసు కోసం బంధువులు ఇంట్లో వెతకగా కనిపించలేదు. దీంతో ద్రాక్షారామలోని తాకట్టు దుకాణాల్లో వస్తువు ఫొటోతో విచారించారు. తేజ బంగారం షాపు వద్దకు వెళ్లి అడుగగా బంగారు గొలుసు నాగిరెడ్డి అప్పారావు తాకట్టు పెట్టినట్టు తెలిసింది. దీంతో మహాలక్ష్మి అల్లుడు సురేష్ ద్రాక్షారామ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ద్రాక్షారామ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం తహశీల్దార్ ఎం.సావిత్రి సమక్షంలో ద్రాక్షారామ శ్మశాన వాటికలో మృతదేహాన్ని తవ్వి తీశారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


పోస్టుమార్టానికి ముందు సమాధి పరిశీలిస్తున్న అధికారులు

ఆర్థిక ఇబ్బందులతో వీఆర్వో ఆత్మహత్య


వీఆర్వో గంగరాజు(ఫైల్)

ఉండ్రాజవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక వీఆర్వో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పాలంగి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పాలంగికి చెందిన యార్లగడ్డ నాగగంగరాజు(41) పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఏడో వార్డు సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పాలంగిలో గతంలో వీఆర్ ఏగా పనిచేస్తూ పదోన్నతిపై వీఆర్వోగా తణుకులో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని పాలంగిలోని ఇంటి వచ్చిన కొద్దిసేపటికే ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి బంధువులు తలుపులు పగులగొట్టి తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా గంగరాజుకు భార్య లక్ష్మి, కుమారులు వేణు, అఖిల్ ఉన్నారు. భార్య జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌దేశంలో ఉంది. కుమారులిద్దరు సంక్రాంతి పండుగకు అమ్మమ్మ ఊరైన మండలంలోని మోర్త గ్రామం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల పాలు కావడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఎవరి ప్రమేయం లేదని సూసైడ్ నోట్ రాసినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో....


వీఆర్వో చంటి (ఫైల్)

రాజానగరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరాంపురం వీఆర్వోగా పని చేస్తున్న దారా శ్రీరామ చంద్రమూర్తి(చంటి) (47) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతి చెందారు. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన చంటి నాలుగేళ్లుగా రాజానగరం మండలంలో విధులు కొనసాగిస్తున్నాడు. సంక్రాంతి నేపథ్యంలో కోడి పందాలు నిర్మూలనలో భాగంగా అధికారుల ఆదేశాలతో భోగి రోజున కూడా విధులు నిర్వహించారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా తలపోటు రావడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు అనంతరం ఆస్పత్రి వైద్యులు బ్రెయిన్‌స్ట్రోక్‌గా నిర్ధారించి సర్జరీ కూడా చేశారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. మృతుడు చంటికి బీటెక్, డిగ్రీ చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. రంపయర్రంపాలెంలో చంటి అంత్యక్రియలు పూర్తిచేశారు.

బి.ప్రత్తిపాడులో ప్రబలిన డయేరియా

30 మందికి పైగా అస్వస్థత


బి.ప్రత్తిపాడులో పర్యటిస్తున్న విరవ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిర, వైద్య సిబ్బంది

పిఠాపురం రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడులో డయేరియా ప్రబలింది. 4రోజులుగా గ్రామంలో వాంతులు, విరోచనాలతో బాధపడుతూ సుమారు 30మందికి పైగా ప్రభుత్వ, ప్రవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నిల్వ చేసిన పదార్థాలతో పాటు హోటల్ నుంచి తీసుకువచ్చిన బిరియానీ తినడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు. గ్రామంలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో విరవ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిర, వైద్య సిబ్బంది పర్యటించారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి పరిస్థితిపై ఆరా తీశారు.

15 నుంచి ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు

కాకినాడ డీఎస్ఏలో ఏర్పాట్లు

30 రాష్ట్రాల నుంచి వెయ్యిమంది హాజరవుతారని అంచనా

కాకినాడ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ చాంపియన్‌షిప్ కాకినాడలో వచ్చే నెల 15 నుంచి 28 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఆర్డీవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ చాంపియన్‌షిప్ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వ్యవహరిస్తారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యిమంది హాజరవుతారని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హాకీ టర్ఫ్ కోర్టు సౌకర్యాల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో కోకనాడ కోస్టల్ క్లబ్ సహకారంతో పోటీలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా ఈ తరహా పోటీలు నిర్వహిస్తున్నారని వీటిని విజయవంతం చేయడానికి జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో ముందుకెళ్తున్నామన్నారు. అర్జున్ అవార్డు గ్రహీత జర్మన్‌ప్రీత్‌సింగ్ ఈ పోటీల్లో పాల్గొంటారని, లీగ్ కమ్ నాకౌట్‌లో ఈ చాంపియన్‌సిప్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాకినాడస్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, ఆదయపన్ను శాఖాధికారి రవిచంద్రన్, పలువురు ఉన్నారు.

22న పారా అథ్లెటిక్స్ జట్టు ఎంపిక

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ నెల 30న జరగనున్న పారా అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక ఈనెల 22న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తారని డీఆర్డీవో తెలిపారు. క్రీడాకారులు ఈనెల 20లోపు 939013 1777లో సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలని ఆయన కోరారు.

నేడు 'నవోదయ' ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష

పెద్దాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో నవోదయ ఆరవ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8971 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పరీక్ష జరుగుతుందని, గంట ముందుగా పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 9441008830, 9440419142 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తూర్పుపాలెంలో పిచ్చికుక్క స్వైర విహారం

మలికిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెం గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పలువురిపై దాడి చేసి గాయపరిచింది. ఎనిమిది మందిని కుక్క కరవడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పిచ్చికుక్కను స్థానికులు అంతమొందించారు.


పిచ్చికుక్క కాటుకు గురైన బాధితుడు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'కేంద్రం ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్‌కు పూర్వవైభవం'

కాకినాడ సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రకటించిన ప్యాకేజీతో విశాఖ స్టీల్ ప్లాంట్ పూర్వవైభవం సంతరించుకోనుందని జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు పునరుద్ధరణ ప్యాకేజీ కింద కేంద్రం రూ.11,440కోట్లు కేటాయించడం శుభపరిణామమని చెప్పారు.

'జ్యోతిబసు చిరస్మరణీయుడు'



కాకినాడలో జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో జ్యోతిబసు చిరస్మరణీయుడని, ఆయన ఆశయాల బాటలో పయనించాలని సీపీఎం నేతలు పేర్కొన్నారు. కాకినాడ సుందరయ్యభవన్‌లో శుక్రవారం సీపీఎం నేత, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం జ్యోతిబసు 15వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి, నగర కమిటీ నేత కె.సత్తిరాజు తొలుత జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. జ్యోతిబసు సీపీఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యుడిగా కష్టజీవుల హక్కుల కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టేకుమూడి ఈశ్వరరావు, జిల్లా నగర కమిటీ సభ్యులు కేఎస్ శ్రీనివాస్, మలక వెంకటరమణ, కె.నాగజ్యోతి పాల్గొన్నారు.

బొగ్గు లోడింగ్ టిప్పర్లను అడ్డుకుని ధర్నా

కాకినాడ సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక లారీ అసోసియేషన ద్వారా కాకుండా వేరే వాహనాల ద్వారా ఓ కంపెనీ ఏ విధంగా ఎగుమతులు చేస్తుందని శుక్రవారం రాత్రి కాకినాడ డీప్ వాటర్ పోర్టు వద్ద బొగ్గు లోడింగ్ టిప్పర్లను అడ్డుకుని లారీ యజమానులు, కార్మికులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్య క్షుడు దాసరి శ్రీనివాసరావు, కార్యదర్శి అల్లం రాజు, కార్యవర్గ సభ్యులు. వర్కర్స్ యూని యన్ అధ్యక్షుడు ఎలిపే శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు, లారీ యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్టు పోలీస్‌స్టేషన సీఐ, సర్పవరం పోలీస్‌స్టేషన్ సీఐలు అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో సంప్రదింపులు జరి పారు. దీంతో శనివారం నుంచి స్థానిక లారీ అసోసియేషన్ ద్వారా వాహనాలను లోడింగ్ ఇస్తామని కంపెనీ యాజమాన్యం వెల్లడించ డంతో లారీ యజమానులు, కార్మికులు ధర్నా విరమించారు.



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

20న జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈనెల 20న కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో మహేంద్ర కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, మెకానిక్ హెల్పర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటీవ్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్‌లో ట్రైనీ అసోసియేట్, ఐసాన్ ఎక్స్‌పీరియన్స్ కంపెనీలో టెలిసేల్స్ ఎగ్జిక్యూటివ్, ఇండో హోండాయ్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. వివరాలకు 77993 76111 నెంబరులో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధికి అడ్డుపడితే తగ్గేదిలేదు

● సురక్షిత తాగునీరందించడమే ధ్యేయం ● ఎమ్మెల్యే పంతం నానాజీ ● రూ.5.84 లక్షల మిగులు బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలకు మార్చి నాటికి పూర్తి స్థాయిలో సురక్షిత తాగు నీరందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, అభివృద్ధికి అడ్డుపడితే తగ్గేదిలేదని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. శుక్రవారం రమణయ్యపేట మండల కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ బిందిలి వీరిష అధ్యక్షతన జరిగిన సర్వసభ్యుల సమావేశంలో 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సందర్భంగా రూ. 5.84.800 మిగులు బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. సవరణ, అంచనా బడ్జెట్‌కి ముందుగా శాఖల వారీగా ఎమ్మెల్యే నానాజీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ, మండల పరిషత్తు, స్టాంపు డ్యూటీ నిధులతో కొత్త వాటర్ పైపులైన్లు ప్రతిపాదించామన్నారు. రూ.7.56 కోట్లతో తాగునీటి సరఫరాకు పనులు ప్రతిపాదించడం జరిగిందన్నారు. జలజీవన్‌తో రూ.47.67 కోట్లతో కొత్తగా 41 ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం జరుగుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. కాకినాడ రూరల్లో ఉపాధి హామీ నిధులతో 123 పనులకు రూ.13.15 కోట్లతో 18 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 6 కిలోమీటర్ల మేర డ్రైనేజీలు నిర్మించడం జరిగిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో రూ.20.58 కోట్లతో సుమారు 203 పనులకు 29 కి.మీ రోడ్లు, 6 కి.మీ డ్రైనేజీలు పూర్తికావచ్చాయన్నారు. పీఎం శ్రీ కింద రూ.1.10 కోటతో ఏపీఎస్పీ హైస్కూల్లో 5 గదుల ల్యాబ్ నిర్మాణం, ఆట స్థలాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కంపెనీల నుంచి సీఎస్‌ఆర్ నిధులు రాబట్టి, ఆ నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తున్నామన్నారు. రైతుల సౌకర్యార్థం మెరుగైన నీటి పారుదల కోసం పీబీసీ ఆధునీకరణ పనులకు 36 పనులకు 19 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తాగునీటి కోసం నిధులను పూర్తిస్థాయిలో వెచ్చిస్తూంటే, ప్రజలకు సురక్షిత తాగునీరు ఇస్తామంటే ఓర్వలేనితనంతో తమకు కమీషన్లు రావనే అక్కసుతో సమావేశం ప్రారంభం కాకుండానే బాయ్‌కాట్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండల సమావేశానికి బీసీ,ఎస్సీ సంక్షేమశాఖ, సివిల్ సప్లయిస్ శాఖ తదితర అధికారుల గైరుహాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు లెటర్ రాయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల మార్గదర్శకంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని.. అభివృద్ధికి అడ్డుతగిలినా, అవరోధాలు సృష్టించినా ఆగేదిలేదన్నారు. బడ్జెట్ సమావేశంలో మొత్తం సభ్యులు 18 ఉండగా 11 మంది గైర్హాజరు కాగా, సమావేశానికి హాజరైన 7 గురు సభ్యుల ఆమోదంతో 2024-25 సవరణ బడ్జెట్ రూ. 43.31 కోట్లు, 2025-26 అంచనా బడ్జెట్ రూ. 43.25 కోట్లు కాగా, రూ5.84,800 లక్షల మిగులు బడ్జెట్‌తో సభ్యులు ఆమోదించారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

అజెండా ఇవ్వకపోవడంతో వాకౌట్

బడ్జెట్ సమావేశానికి సంబంధించిన అజెండా కాపీలు సభ్యులకు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ సమావేశాన్ని వాకౌట్ చేస్తున్నట్టు వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తెలిపారు. సమావేశానికి 3 రోజుల ముందు అజెండా కాపీలు సభ్యులకు ఇవ్వాల్సిఉందని, కనీసం సమావేశం రోజున అజెండా కాపీ ఇవ్వమని కోరినా అధికారులు పట్టించుకోకపోవడంపై నిరసనగా సమావేశాన్ని బహిష్కరించామని సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ,రాందేవు సూర్యప్రకాశరావు అన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 14మందికి కాకినాడ 1వ ఎస్‌జేఎస్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు తన సిబ్బందితో గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్నవారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 14మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 8 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా, మరో ఆరుగురికి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు సీఐ నాగదుర్గారావ్ తెలిపారు.

కాకినాడ రూరల్‌లో ఎనిమిది మందికి...

కాకినాడ రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ సారధ్యంలో కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాను తగ్గించాలనే ఉద్దేశ్యంతో స్టేషన్‌పరిధిలో తాగివాహనం నడుపుతున్న వాహనదారులకు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించి ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ బి.పెద్దిరాజు తెలిపారు. వారందరినీ కోర్టులో పరుచగా కాకినాడ 2వ ప్రత్యేక జ్యూడీషియల్ రెండో తరగతి మెజిస్ట్రేట్ వి.నరసింహారావు మొత్తం 8మందిలో ఇద్దరికి ఒక్కొక్కరికీ 2రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, 6గురికి ఒక్కొక్కరికీ రూ.10,000 వంతున జరిమానా విధించారని తెలిపారు.

క్షతగాత్రులకు రూ.5 లక్షలు సాయం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రకటన

సామర్లకోట, జనవరి 17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపాన ఒమ్మంగి గోపాల చెరువు వద్ద గురువారం జరిగిన టెంపో వ్యాన్ బోల్తా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వనసపాడు మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 26 మంది బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తన వంతు సాయంగా రూ.5 లక్షలు అందిస్తానని శుక్రవారం ప్రకటించారు. బాధితులను శుక్రవారం మెడికవర్ ఆసుపత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే నానాజీ అక్కడి వైద్యులను బాధితుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. బాధితుల్లో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుసుకుని వారికి మరింత మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి ప్రధాన వైద్యులను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే డాక్టర్లు జయప్రకాష్, అరుణ్‌కుమార్, జగదీశ్వరరావు, కళ్యాణ్ రవితేజ, ఉప్పల సుబ్బారావు, రాజా అమరేంద్రలతో కూడిన వైద్యబృందంతో ఎమ్మెల్యే నానాజీ సమీక్షించారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న నానాజీ

'బీసీ ఉద్యోగుల' క్యాలెండర్ ఆవిష్కరణ



కాకినాడ సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆవిష్కరించారు. బీసీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తుల వీరబ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు రామానుజం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు, ప్రతినిధులు కొత్తపల్లి రాఘవ, అద్దంకి వెంకన్నబాబు, మల్లు సత్యనారాయణ, సిద్ది వెంకటేశ్వరరావు, ములంపాక శ్రీనివాసరావు, రాపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరిడమ్మకు పంచామృతాభిషేకం



పెద్దాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని బుధవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాభిషేకంలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, వేదపండితులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పీహెచ్‌సీల తనిఖీ

కొత్తపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ (డీఎంహెచ్‌వో) జె.నరసింహనాయక్ శుక్రవారం కొమరగిరి, నాగులాపల్లి పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఆసుపత్రుల రికార్డులు, ఓపీ వార్డులు, లేబర్ రూమ్‌లు, ఫార్మసీ స్టోర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా ప్రబలే వ్యాధులపట్ల ఆరోగ్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో విజ్ఞప్తి చేశారు. నాగులాపల్లి, కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్లు, ఆయన వెంట ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరప, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మద్యం అనుకుని చెదల మందు తాగి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న ఒక వృద్ధుడు మృతి చెందినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావు(60) ఈనెల 11న సాయంత్రం అదే గ్రామంలో నివాసముంటున్న పెద్ద కుమార్తె చీకట్ల రమణమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ మద్యం బాటిల్‌లో ఉన్న టర్పంటైల్, చెదల మందు మిశ్రమాన్ని చూసి మద్యం అనుకుని తాగి వాంతులు చేసుకున్నాడు. క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

పటవలలో భూ రీసర్వే ప్రారంభం

తాళ్లరేవు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలం పటవల గ్రామంలో భూ రీసర్వే కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమవుతుందని డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబు శుక్రవారం తెలిపారు. అభ్యంతరాలు, వివిధ రకాల సమస్యలకు అవసరమైన పూర్తి జెరాక్స్ కాపీలను గ్రామ రెవెన్యూ అధికారులకు అందజేయాలని ఆయన కోరారు.

తహశీల్దార్ కార్యాలయంలో బ్యాటరీల మాయం

సర్పవరం జంక్షన్, జనవరి 17(ఆంధ్ర జ్యోతి): కాకినాడ రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో సుమారు 38బ్యాటరీలు అదృ శ్యం అయ్యాయి. సార్వత్రిక ఎన్నికల వరకు తహశీల్దార్ గది పక్కనే ఉన్న ఆఫీసు గదిలో ఉన్న బ్యాటరీలు ఎన్నికల తర్వాత కనిపించకుండా అదృశ్యం కావడంపట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మండల ప్రజలకు పౌర సేవల సరళీకృతం కోసం రెవెన్యూ కార్యాలయానికి సుమారు 6 కంప్యూటర్లను అధికారులు కొనుగోలు చేశారు. విద్యుత్తు సమస్య లేకుండా పౌర సేవలకు అంతరాయం లేకుండా ఉండేందుకు వీలుగా ఇన్వెర్టర్ కోసం సుమారు రూ.4 లక్షలతో సుమారు 38 బ్యాటరీలను కొనుగోలు చేశా రు. కొన్ని బ్యాటరీలను కంప్యూటర్లకు అనుసంధానం చేయగా, మరి కొన్ని బ్యాటరీలు తహశీల్ధార్ గది పక్కనే ఉన్న రికార్డు రూమ్‌లో భద్రపర్చి ఉంచారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ బ్యాటరీలను అచ్చంపేట సెంటర్‌లో గల అక్సాఎంఎస్‌ఎన్‌లో ఎన్నికల నిర్వహణ, శిక్షణా కేంద్రానికి అధికారులు తీసుకుని వెళ్లి, అక్కడ ఎన్నికల విధుల్లో వీటిని వినియోగించారు. ఎన్నికలు ముగిసి సుమారు ఎనిమిది నెలల కావస్తున్నా తహశీల్ధార్ కార్యాలయం నుంచి తీసుకెళ్లిన బ్యాటరీలను వెనక్కి తీసుకురాకపోవడం పట్ల పలువురు అధికారుల తీరుపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్యాటరీలపై అడుగుతుంటే అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకసారి ఈ బ్యాటరీలను అమ్మేశామని, అమ్మగా వచ్చిన డబ్బులతో తహశీల్ధార్ కార్యాలయానికి స్టేషనరీ కొనుగోలు చేశామని అధికారులు చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ఏ వస్తువునైనా విక్రయించాలంటే ముందుగా ఆ శాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని, ఒక విధానం ప్రకారం వేలం పెట్టాల్సి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం కొనుగోలు చేసిన ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువుల మాయంపై గతంలో రెవెన్యూ కార్యాలయం అధికారులపై పలు విమర్శలు వచ్చాయి. బ్యాటరీల అదృశ్యంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి ప్రభుత్వ ధనాన్ని రికవరీచేయాలని ప్రజలుకోరారు.

అధికారుల చేతి వాటంపైనే అనుమానాలు



తహశీల్దార్ కార్యాలయంలో బ్యాటరీలు (ఫైల్)

డేటా ఎంట్రీ ప్రక్రియను నిర్వహించాలి

● పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి



ప్రసంగిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

సామర్లకోట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి నష్టం జరుగకుండా వారి భూములపై వారికే హక్కు కల్పించేలా రీసర్వే, అప్డేట్,డేటా ఎంట్రీ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి పేర్కొన్నారు. సామర్లకోట టీటీడీసీ ఆవరణలో పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధికి చెందిన 11 మండలాల సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణా తరగతులను ఆర్డీవో శ్రీరమణి శుక్రవారం ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ భూసమస్యలకు సంబంధించి వచ్చిన ఇబ్బందులను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. పలువురు సర్వేయర్లు లేవనెత్తిన పలు సమస్యలకు నివృత్తి చేశారు. డీఎస్ ఎల్‌వో కె.శ్రీనివాసరావు పలుసూచనలు చేశారు. డివిజన్ పరిధిలో అన్ని మండలాల సర్వేయర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన పెంపొందించాలి

● ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టంపై అవగాహన పెంపొందించాలని ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో శుక్రవారం నుంచి ప్రారంభమైన రెండురోజుల పంచాయతీ ఎక్స్‌టెన్షన్ ఇన్ షెడ్యూల్ ఏరియాస్ (పీసా) చట్టంపై మొదటి బ్యాచ్ శిక్షణా తరగతులను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ప్రారంభించారు. శ్రీకాకుళం నుంచి పశ్చిమగోదావరి అయిదు జిల్లాల వరకూ గల ప్రభుత్వంలో పనిచేస్తున్న వివిధ స్థాయిలలో అధికారులు ఎంవోటీలుగా ఈశిక్షణా కేంద్రంలో సుమారు 108 మంది అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రణాళికలు రూపొందించేందుకు ఇటువంటి శిక్షణా తరగతులు దోహదపడతాయని, ఇక్కడ శిక్షణ పొందిన ఎంవోటీలు క్షేత్రస్థాయిలో కిందిస్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాల్సిఉందని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పేర్కొన్నారు. జాయింట్ డైరక్టర్ శ్రీదేవి, డిప్యూ టీ డైరక్టర్ రామనాధంలు పలు అంశాలపై సమగ్రంగా వివరించారు. వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఆంజనే యులు, ఎం.చక్రపాణీరావు, వి.ప్రసాద్, నీహారి క, డీఆర్‌ఎన్ పద్మజలు పాల్గొన్నారు.



శిక్షణా తరగతులలో పాల్గొన్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

క్రికెట్ టోర్నమెంట్ విజేత నాగులాపల్లి

కొత్తపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నాగులాపల్లిలో మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లిఅబ్బాయిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో నాగులాపల్లి టీమ్ ప్రథమస్థానం కైవసం చేసుకొంది. ఈనెల 13 నుంచి 16వరకు స్థానిక ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో 40 టీములు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీల్లో నాగులాపల్లి టీము ప్రథమ బహుమతి సాధించింది. ప్రథమ బహుమతిగా వీవీఎస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి ఇచ్చిన రూ.15వేల నగదును పీబీసీ డీసీ-2 ఛైర్మన్ అనిశెట్టి సత్యానందరెడ్డి శుక్రవారం అందజేశారు. ద్వితీయస్థానం పొందిన కొమరగిరి టీమ్‌కు రామకృష్ణ మెడికల్ స్టోర్ నిర్వాహకుడు రూ.9వేల నగదు బహుమతిని అందజేశారు.

ఎల్ఐసీ ప్రసాద్ నేత్రదానం



ప్రసాద్ (ఫైల్)

తాళ్లరేవు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు గ్రామానికి చెందిన ఎల్ఐసీ పంపన ప్రసాద్ శుక్రవారం తెల్లవారుజామున స్వగృహంలో అనారోగ్యంతో అకస్మికంగా మృతిచెందారు. కుటుంబ సభ్యులు అంగీకారంతో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు ప్రసాద్ నేత్రాలను దానం చేశారు. టెక్నీషన్లు కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. కాటాడి రమేష్, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, చోడే శ్రీనివాస్, బొంతు మోహన్, బండారు దొరబాబులు ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి అభినందించారు.

జడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్, సీఈవో

కాకినాడ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములై చురుకైన పాత్ర వహించి ఆయా మండల పరిషత్‌ల అభివృద్ధికి పాటుపడాలని జిల్లా ప్రజాపరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. జడ్పీ పరిధిలో పనిచేస్తున్న ఏడుగురు సీనియర్ అసి స్టెంట్లకు పరిపాలనాధికారులుగా పదోన్నతి కల్పిస్తూ నియామకపు ఉత్తర్వులు అందజేశా రు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్ర వారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

● పిఠాపురంలో ప్రత్యేక ఆకర్షణ

పిఠాపురం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రతి ఏటా ఏర్పాటు చేసే ఈ బొమ్మల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పట్టణంలోని మంగాయామ్మరావుపేటకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయురాలు తటవర్తి నాగలక్ష్మి ప్రతి ఏటా కనుమ పండుగ రోజున బొమ్మల కొలువు ఏర్పాటుచేస్తారు. చిన్నారులు వచ్చి బొమ్మలను తిలకించేందుకు వీలుగా ఈ ప్రదర్శనను నాలుగురోజులు పాటు ఉంచుతారు. సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా వివిధ రకాలను బొమ్మలను సేకరించి ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. దేవతా మూర్తుల రూపాలు, మానవుల స్థితిగతులు, పూర్వీకులు వాడే పనిముట్లు, అర్చకులు చేసే యజ్ఞయాగాదులు, వివేకానందుడు, చెప్పులు కుట్టడం సహా వివిధ అంశాలను తెలియజేసే వాటితో పాటు పలు రకాలను బొమ్మలను ప్రదర్శనలోఉంచి వాటిగురించి తిలకించేందుక వచ్చే విద్యార్థులు, చిన్నారులకు నాగలక్ష్మీ వివరిస్తారు.



ఇంటిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

కేరట్ మనదే!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్స్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని సరిచేసే గుణం వీటికుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటీన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతే కాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!



కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.

'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

తాజా తాజా చట్నీలు

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు:

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం- అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

తయారీ విధానం:



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్ల ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

జాగ్రత్తలు:

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

ముల్లంగి ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

జాగ్రత్తలు:

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

చేమ ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింతపండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

జాగ్రత్తలు:

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు

దుస్తులపై మరకలా... వదిలించండిలా...

ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!


- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్ పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తేలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి

పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!



'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేద వ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమ వేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్‌ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతారామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ చిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే, నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్ అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.

మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్



'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

పెద్దోడిని అభినందించిన చిన్నోడు

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేశ్

కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జివాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజిలకు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.

భావోద్వేగ సన్నివేశం..

అర్జున అవార్డు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్ టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్



గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.

షూటర్ ముకేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మొహాలీలో జరిగిన అఖిల భారత విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ముకేష్ రజతంతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముకేష్ రెండో స్థానంలో నిలిచాడు.

చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో జాతీయస్థాయి పాఠశాల చెస్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఘనంగా మొదలైంది. టోర్నీని స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.

స్టార్లు సాఫీగా..



సబలెంకా

- ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్
- ఏడో సీడ్ పెగులాకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కోకో గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. ఏడో సీడ్ జెస్సికా పెగులాకు అన్‌సీడెడ్ సెర్బియా క్రీడాకారిణి ఓల్గా డానిలోవిచ్ షాకిచ్చింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 యూఎస్ ఓపెన్ రన్నరప్ లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టాసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పౌలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్త్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని, 27వ సీడ్ పల్యుచెన్కోవా 6-1, 6-2తో సీగ్మండ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడెర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. మరోవైపు నవోమి ఒసాకా 6-7 (7)తో టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ బెలిండా బెన్సిక్‌తో తొలి సెట్‌ను కోల్పోయిన దశలో పొత్తి కడుపు నొప్పితో మ్యాచ్ నుంచి నిష్క్రమించింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. అయితే రెండో సెట్‌లో జొకో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. ఆపై చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు. రెండో సీడ్ జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ బోణీ

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత వెటరన్ రోహన్ బోపన్న మిక్స్‌డ్‌లో బోణీ చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్ చేరింది.

అమ్మాయిలూ.. అదరగొట్టాలి

- డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్
- తొలి రోజే ఆరు మ్యాచ్‌లు
- రేపు విండీస్‌తో యువ భారత్ పోరు

నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్ కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఎ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

భారత్ షెడ్యూల్

జనవరి 19	వెస్టిండీస్‌తో
జనవరి 21	మలేసియాతో
జనవరి 23	శ్రీలంకతో

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి

త్రిష మరోసారి..



గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

భారత మహిళల జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషితా, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

సింధుకు చుక్కెదురు

- సెమీస్‌కు సాత్విక్ జోడీ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హాంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యాక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.



సీఎం చంద్రబాబును కలిసిన హంపి

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా హంపిని చంద్రబాబు అభినందించారు. తెలుగు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన హంపి.. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు గెలవాలని సీఎం ఆకాంక్షించారు. హంపి వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.

విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు | కర్ణాటక X విదర్భ మ. 1.30 నుంచి

'ఆటో' పెట్టుబడుల కేంద్రంగా భారత్

నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని



న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాట వేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.

వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు



మెర్సిడెస్ బెంజ్ సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సీరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్ఎస్ 600 నైట్ సీరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఎల్ఏ కారును ఆవిష్కరించింది.




జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.



పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెలూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

బిజినెస్

విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరు కు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

12,000 నియామకాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

కస్టమర్లకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్‌నే ఉపయోగించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే: మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

మారుతి ఈ-విటారా



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్లు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	112	విజయవాడ	131
వరంగల్	112	గుంటూరు	130
కరీంనగర్	112	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	127	అనంతపురం	109
గోదావరి	131		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,270 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,820 ▲	77,000 ▲	93,500 ▲
విశాఖపట్నం	79,290 ▲	72,680 ▲	91,760 ▼
రాజమండ్రి	84,270 ▲	74,500 ▲	91,700 ▲
ప్రొద్దుటూరు	80,350 ▲	74,400 ▲	93,500 ▼
ముంబై	79,239 ▲	72,583 ▲	90,820 ▼

Printed and published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 208/5A, Diwancheruvu to Velugubanda Road, Palacharla (V), Rajanagaram Mandal, Rajamahendravaram - 533 102, Editor : **N.Rahul kumar**, RNI No. APTEL/2004/11740, Managing Director : **Vemuri Radha Krishna**, Founder : **K.L.N.Prasad**.

వనదుర్గ ఆలయంలో చండీ హోమం



అన్నవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పూజలు జరిపారు. 11 గంటలకు పవిత్ర హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పీవీటీజీల గృహాలను సకాలంలో పూర్తి చేయాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పీవీటీజీలకు మంజూరైన గృహాలను సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన గృహాల నిర్మాణంపై ఏడు మండలాల వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, అసిస్టెంట్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. మంజూరైన గృహాలకు ఇంజనీరింగ్ అసిస్టెం ట్లు, సర్వేయర్లు జాయింట్ సర్వేను ఈ నెల 30లోగా పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి 15లోగా అన్ని మండలాల్లో గృహ నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ మంజూరైన గృహాలకు నిబంధనల ప్రకారం పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు పి.రామకృష్ణ, సీహెచ్ శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, కె.సత్యనారా యణ, వేణుగోపాల్, బాలాజీ, ఎంపీడీవోలు సుండం శ్రీనివాస్‌దొర, రత్నకుమారి, యాదగిరి ఈశ్వరరావు, విశ్వనాథ్, ఇంజనీరింగ్ అధికారులు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియేలు పాల్గొన్నారు.

ఏజెన్సీలో మలేరియా నిర్మూలనకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫీవర్ కేసులపై ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో వైద్యాధికారులు పర్యటించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లెప్రసీ కేసులను గుర్తించేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి ఏడు మండలాల్లో సర్వే నిర్వహిస్తామన్నారు. ఏడీఎంహెచ్‌వో శిరీష, సూపరింటెండెంట్లు శేషారెడ్డి, రాహుల్, సతీష్, సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మీప్రసన్న, ఏఎంవో రాజు, ఎంపీహెచ్‌వో పీటర్, ఏడు మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ఇందుకూరుపేటలో 2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

దేవీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అలనాటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న వారు ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడడం గర్వంగా ఉందన్నారు.



ఇందుకూరు-1 ఆర్అండ్ఆర్ కాలనీలో విచారణ చేస్తున్న అధికారులు

ఆర్అండ్ఆర్ దరఖాస్తుల పరిశీలన

దేవీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు-1 ఏనుగుల గూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో రెవెన్యూ అధికారులు ఆర్అండ్ఆర్ దరఖాస్తులను పరిశీలించారు. నాలుగు రోజులు క్రితం రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఇందుకూరుపేట తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో పలువురు దరఖాస్తులు ఇచ్చారు. వాటిని ఆయా గ్రామాలకు వెళ్లి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని వారి వద్ద నుంచి వివరాలు తీసుకున్నారు.

'చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు'



యువతకు వాలీబాల్ కిట్ అందిజేస్తున్న ఎస్ఐ చిన్నబాబు

రాజవొమ్మంగి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చిన్నబాబు హెచ్చరించారు. మండలంలోని ఉర్లాకలపాడు గ్రామస్తులతో జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు శుక్రవారం సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా, పండించడం, సారా కాయడం, అమ్మడం చేయరాదన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో అనుమతి లేకుండా ఎలక్ట్రికల్ వైర్లు అమర్చరాదన్నారు. సామాజిక మాధ్యమాలతో మోసపోవద్దన్నారు. జూదాలకు యువత దూరంగా ఉండాలని క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు.



ఎద్దభీంపల్లిలో చలి మంట వద్ద సేదతీరుతున్న గిరిజనులు

బాబోయ్ చలి

దేవీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం ఏడు గంటలు దాటితేనే కానీ ఇళ్లల్లోంచి బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం ఐదు అవ్వగానే ఇళ్లల్లోకి వెళ్లిపోతున్నారు. ఆరు బయట మంటలు వేసుకుని చలి కాగుతున్నారు.

రంపచోడవరం ఎస్‌డీపీవోగా

సాయి ప్రశాంత్

రంపచోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రొబేషనరీ డీఎస్పీలుగా వున్న పలువురికి ఎస్‌డీపీవోలుగా పోస్టింగ్ ఇస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రంపచోడవరం ఎస్‌పీడీవోగా గుడిదేశి సాయి ప్రశాంత్‌ను నియమించారు.

ప్లాస్టిక్ వాడకంతో సకల జీవరాశికి అనర్థం

దేవీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ఇందుకూరుపేటకు చెందిన యువకుడు పుల్లె నాగేంద్ర తన వంతు కృషి చేస్తున్నాడు. ఇందులో భాగంగా శుక్రవారం గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా పక్క వీధిలో తనతో పాటు పలువురి సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ వాడకుండా సకల ప్రాణులను రక్షించాలని కోరాడు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





హరిశ్చంద్ర నాటకంలో వారాణిసి ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, కురుక్షేత్రంలోని రాయభార ఘట్టంలో దుర్యోధనుడు పాత్రధారి రావుకి మెమెంటో అందజేస్తున్న గౌరీశంకరుల ఉత్సవ కమిటీ సభ్యులు

ఆకట్టుకున్న రాయబారం, వార్ సీన్లు

ప్రత్తిపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గౌరీశంకరుల 88వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ప్రధాన నాటకాలైన కురుక్షేత్రంలోని రాయబారం సీను, రామాంజనేయ యుద్ధంలోని వార్ సీన్, సత్యహరిశ్చంద్రలోని వారణాసి సీనును రాష్ట్రంలో పేరొందిన కళాకారులు ప్రదర్శించారు. కురుక్షేత్రంలోని రాయబార ఘట్టంలో దుర్యోధనుడిగా డీఎస్‌పీ రావు, శ్రీకృష్ణుడుగా షణ్ముఖ శ్రీధర్‌రాజు, అర్జునుడిగా నేలపూడి రంగారావు, శ్రీకృష్ణార్జున యుద్ధం వార్ సీనులో రాముడుగా ఎం.లతశ్రీ, ఆంజనేయుడుగా ఏలూరి పైడిరాజు, సత్యహరిశ్చంద్రుడులోని వారాణసీ ఘట్టంలో హరిశ్చంద్ర పాత్రలో మినగల్లు సుధాకర్, చంద్రమతిగా ఎం.సత్యవతి, నక్షత్రుడిగా ఎం.లతశ్రీ, కాళకౌశికగా డి.సుబ్బారావు పద్యధారణ, గాత్ర మాధుర్యంతో ఆకట్టుకున్నారు. దుర్యోధనుడు పాత్రలో అత్యద్భుతంగా నటించిన డీఎస్‌పీ రావును గౌరీశంకరుల ఉత్సవ కమిటీ సభ్యులు కిల్లాడి బాబ్జీ, కోనేటి రాజబాబు, గొనగాల రామకృష్ణ శాలువా కప్పి సన్మానించి మెమెంటో అందించారు.

'తెలుగు కీర్తి' జాతీయ పురస్కారానికి విజయరత్నం ఎంపిక



కిర్లంపూడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి మండలంలోని తామరాడ ఉపాధ్యాయుడు తిరగటి విజయరత్నం ఎంపికయ్యారు. శ్రీశ్రీ కళా వేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్ కళా వేదికలో జరిగే కార్యక్రమంలో విజయరత్నం పురస్కారం అందుకోనున్నారు.

'తిరుమల కొండపై అన్నమయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజీలు

ప్రత్తిపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై అన్నమయ్య కళాక్షేత్రం వద్ద అన్నమయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని, అన్నవరం పుణ్యక్షేత్రంలో హరినామసంకీర్తనలు నిర్వహించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి కోరారు. మండలంలోని ధర్మవరం నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాలకు చెందిన భజన కళాకారులతో సమావేశం నిర్వహించారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతితో పాటు చిత్రాడ, గొల్లప్రోలకు చెందిన విశ్వనంద భారతి స్వామి, నిర్భయానంద స్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయశంకర స్వామీజీ మాట్లాడుతూ తిరుమల కొండపై అన్నమయ్య విగ్రహాల ఏర్పాటు పోరాటాల్లో భాగంగా 11.55 లక్షల సంతకాలు సేకరించినట్టు తెలిపారు. చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటైన సంకీర్తన మండలిలో భజన మండళ్ల కళాకారులందరూ సభ్యులుగా చేరాలని పిలుపు నిచ్చారు. అన్నవరంలో హరినామ సంకీర్తనలకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లోని భజన మండళ్ల సభ్యులందరూ ఫిబ్రవరి 5న పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా భజన మండలి కన్వీనర్ సానా నూకరాజునాయుడు, వీహెచ్‌పీ కార్యకర్తలు, భజన కళాకారులు దొడ్డిపట్ల సోమన్న దొర, సోనా తాతీలు, సూరిబాబు, బావిశెట్టి సుబ్బారావు ప్రసంగించారు.



కత్తిపూడిలో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

కత్తిపూడిలో విద్యార్థుల అ'పూర్వ' కలయిక

శంఖవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పరిచయం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. స్నేహితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. తాము చదివిన పాఠశాలకు సౌకర్యాల కల్పనకు సహకారం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. మరో ఐదేళ్లలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.



లంపకలోవ హైస్కూల్లో 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

లంపకలోవలో అ'పూర్వ' సమ్మేళనం

ప్రత్తిపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ ప్రాంగణంలో మొక్కలు నాటి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎవరెవరు ఏయే రంగాల్లో ఉన్నారో ముచ్చటించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. బర్ల సూర్యప్రకాష్, సుర్నీడి హరిబాబు, హరిదాసుల శివాజీ, బొల్లు వీర నాగేశ్వరరావు, బొందలపు రమణబాబు, ప్రగడ రామకృష్ణ, కప్పల నానాజీ, చంద్ర రాజా, సంగన అరుణ్‌కుమార్, సుభాషిణి, గంటా మంగతాయారు, సుజాత, శుభ, వీరాంజనేయదేవి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్బయ్యమ్మపేటలో పోలీసు గ్రామసభ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

గండేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యమ్మపేటలో జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, చీటింగ్‌లు, మహిళా రక్షక్, డ్రగ్స్ వద్దు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై అప్రమత్తంగా ఉండి ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలలకు ఆటోలో పిల్లలు ఎక్కువ మందిని పంపించకుండా చూసుకోవాలన్నారు. సైకిల్‌పై పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్ఐ యూవీ శివనాగబాబు, గ్రామ పెద్దలు బొండా శ్రీనుబాబు, గొల్లవిల్లి అప్పలరాజు, కుంచె త్రినాథరావు, గొల్లవిల్లి అబ్బాయి



రైటప్: సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు

'ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యం'

కూనవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో చైతన్యం నింపడమే ప్రజా నాట్యమండలి లక్ష్యమని ప్రజా నాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కూన వరంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం కోసం ముంపు మండలాల్లోని అనేక గ్రామాల్లో ప్రజా నాట్యమండలి ద్వారా సభలు నిర్వహించామన్నారు. మండల కన్వీనర్ కారం కన్నారావు, హరీష్, మారయ్య, వసంత్, కామేష్, తాళ్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హరిదాసును సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

హరిదాసు రామకృష్ణకు సన్మానం

జగ్గంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సమీపంలోని నాసరం గ్రామానికి చెందిన హరిదాసు బెజవాడ రామకృష్ణ మర్రిపాక గ్రామం సుభిక్షంగా ఉండాలని ధనుర్మాసం నెల రోజులు రామనామ సంకీర్తన చేశాడు. చివరి రోజున ఇంటింటకీ తిరగ్గా బియ్యం, కూరగాయలు, కానుకలు ఇచ్చారు. శుక్రవారం హరిదాసును సర్పంచ్ జగతం ఆనందరావు, ఎంపీటీసీ పైలా శివరామకృష్ణ, గ్రామస్తులు సన్మానించారు.



సుబ్బారావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు సుబ్బారావుకు సన్మానం

ఏలేశ్వరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తిలో ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు ఆలమూరి సుబ్బారావును శుక్రవారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన తన ఉపన్యాసాలతో హిందూ మతాన్ని మరింత బలోపేతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉడతల రమణారావు, మోటేపల్లి నారాయణ, తూము వెంకన్న, నీలి రాంబాబు, తాతీలు, వల్లంరెడ్డి కొండయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి తహసీల్దారుగా రమేష్

రౌతులపూడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి తహసీల్దారుగా ఎస్వీ రమేష్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్‌కు తహసీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

'సంస్కృతి పరిరక్షణకు యువత నడుంబిగించాలి'



ముగ్గుల పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న సీఐ చెన్నకేశవరావు

కోటనందూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముక్కనుమ సందర్భంగా మండలంలోని జగన్నాథపురంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు యువత నడుంబిగించాలని కోరారు. ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి రాజుబాబు, మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, యర్ర చినసత్యనారాయణ, ఎస్ఐ టి.రామకృష్ణ, అంకంరెడ్డి రాజశేషు, మాతిరెడ్డి బాబులు, గొర్లి రాజు, గుడివాడ నాని, రాయపురెడ్డి గిరిశంకర్, మాతిరెడ్డి సత్యనారాయణ, గుడివాడ గోవిందు, యర్ర బాబ్జీ, యర్ర కృష్ణ, బీమిరెడ్డి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'పై వీడియో కాన్ఫరెన్స్

గండేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీవో నాతి బుజ్జి, ఈవోపీఆర్డీ కె.చంద్రశేఖర్, ఏపీవో గంగాభవాని, కార్యదర్శులు పాల్గొన్నారు. ఏపీని దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 12 నెలలకు 12 థీమ్‌లతో ప్రతినెలా మూడవ శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించాలన్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలి మృతి

జగ్గంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుంపటితో రేగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని కాట్రావులపల్లికి చెందిన పి.ఎర్రమ్మ (60) ఈ నెల 15వ తేదీ రాత్రి నిద్రపోవడానికి ముందు చలికి తట్టుకునేలా మంచం కింద కుంపటి పెట్టుకుంది. దాని నుంచి దుప్పటికి నిప్పంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. గాయపడిన ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది. జగ్గంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండువేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటిమామిడి పంచాయతీ కొత్తపాకలు గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది, ఈఎస్టీఎఫ్ సిబ్బంది శుక్రవారం సంయుక్తంగా దాడులు జరిపారు. నాటుసారా తయారీకి ఉపయోగించే రెండువేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్- ప్రొహిబిషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ చౌదరి తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుపేటలో శుక్రవారం విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. అనకాపల్లి జిల్లా నాతవరంమండలం మన్యపురట్ల నుంచి చినబొడ్డుపల్లి వెళ్తున్న గడ్డి ట్రాక్టరుకు కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలాయి. ఈ ఘటనను చూసిన స్థానికులు విషయాన్ని అగ్నిమాపక శాఖ అధికారులకు తెలపగా వారు వచ్చి మంటలను ఆర్పారు.

క్షతగాత్రులకు సాయం

సామర్లకోట: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపాన ఒమ్మంగిలో టెంపో వ్యాన్ బోల్తా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పనసపాడు మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 26 మందికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ రూ.5లక్షలు సాయం ప్రకటించారు.